# అరటితొక్క

పడవ అంచున కూర్చున్న ఒంటరి ముసలమ్మ పడవ్వాడితో,
"ఏలయిపోతంది. బేగి పోనియ్ నాయిన్నాయినః" అంది.

బుట్టొకటి భద్రంగా పట్టుకు పడవెక్కి బుట్టని భద్రంగా పడవ మధ్య తనకి చేరువగా పెట్టుకొని అంచున భద్రంగా కూర్చుంది ముసలమ్మ. ఏటికవతలి గట్టున పట్నంలో ఎక్కడో ఏ మూలో ఏ కూలి పనో చేసుకొనే కొడుక్కో మనవడికో అల్లుడికో మేనల్లుడికో ఎవరికో కాని మధ్యాహ్నపు కూడు మోసుకువెళ్తున్నట్టుందామె. ఆమె ముఖమంతా వీధిలో విసిరివేయగా ఎండకు ఎండి వానకి తడిసిన పాత జోడులా బీటలువారి గీతలుగీతలుగా ఉంది.

ఏటికి ఇవతలిగట్టున కొండవార మధ్యాహ్నపు ఎండలో ఎర్రని నీటిమీద, దెబ్బతిన్న పిట్టలా, అటూ ఇటూ కదుల్తోంది పడవ. పడవ ముసలాడు ఇంకా బేరాలొస్తాయేమోనని చూస్తున్నాడు. రెండో చివర కూర్చున్న అతని పాతికేళ్ళ కొడుకు ఇంటి దగ్గరి భార్య గురించి కాబోలు అదేపనిగా ఆలోచిస్తున్నాడు. ముసలమ్మకి ఎదురుగా రెండో

అంచున కూర్చున్న జగన్నాథం నీరసంగా శూన్యంలోకి చూస్తూ కూర్చు న్నాడు. పడవలో ఇంకెవరూ లేరు.

"బేగి ఎళ్నెయ్ బాబూ" అంది పడవ్వాడితో ముసలమ్మ.

"తొందరేటి ముసలమ్మా?! ఎల్తాంకాని ఉండిపోతావా(?" అన్నాడు పడవ ముసలాడు.

"బేరాలేం ఒచ్చేట్టులేదు. మరింక పోవొచ్చుమనం", అన్నాడు జగన్నాథం కూడా, శూన్యంలోంచి కొంచెం బైటికివచ్చి.

"వెళ్ళిపోదాం బాబూ! ఒక్కడుగు ఆగండి;" అని జగన్నా థంతో చెప్పి, "ముసలమ్మా! మాలచ్చి ఇంకా రానేదు. రాదేటియాళ?" అని ముసలమ్మని ప్రశ్నించేడు పడవముసలాడు.

అందుకు సమాధానంగా రెండు చేతులూ ఒక్కసారి చరిచి, రెండు చేతుల్తోనూ గుండె లొక్కసారి బాదుకొని, "హయ్య బాబూ! ఇంకెక్కడి మాలచ్చిరా నాయినా!!" అంది ముసలమ్మ.

"ఏం? ఏటొచ్చింది?" అన్నాడు పడవవాడు.

"సావురా నాయినా, సావొచ్చినాది!" అంది ముసలమ్మ.

"మొన్నగావాల జూసినాను, నిక్చేపరాయిళ్ళాగుంది!" అని ముక్కుమీద వేలేసుకున్నాడు పడవ ముసలాడు.

"మొన్న నీపాటేలకి నిక్చేపరాయిళ్ళాగే వుంది. టవున్నుంచి ఊసుల్జెప్తా నాతోపాటు నిక్చేపరాయిళ్ళా ఇంటికి తిరిగొచ్చినాది. పొద్దోయి తొంగుడుంది, అప్పుడు కూడ రాయినాగే వుంది, మరింక నిన్న పొద్దుటికి నెగిసిందికాదు. ఏటిశెప్మా నెగిసింది కాదనుకున్నాను(! అయ్యోలమ్మో అనుకొని జూస్తె ఇంకేటుంది? సచ్చిపోనాది!" అంటూ మధ్య మధ్య చేతులు చరుస్తూ, గుండెలు బాదుకొంటూ రాగవరసలో చెప్పింది ముసలమ్మ.

పడవ్వాడు "మాలచ్మి" గురించి విచారం వెలిబుచ్చి. కాల ధర్మం గురించి సూక్తులు కూడా పలికేడు. ఆఖర్న. "పండు ముసిలైపోనాది. రాలిపోనాది. మరింక దానికి సావడవేఁ సుకం!" అని తీర్పు చెప్పేడు.

"సావడవేఁ సుకంగాని. బాబొ౦రే, దానిగ్గూడ అదృష్టఁవుండాల! రమ్మంటే ఇయాళ సావొచ్చుద్దా నాకు ? మాలచ్మి నా కంటే సరీగ్గ కరకటీగ వయిదు ఏంటలు సిన్న. అదుష్టఁవుండి అవెల్లిపోనాది, నాను మాత్తరం ఇదిగో విలా ఒరళ్ళా ఉండిపోనాను. ముందికి బగమంతుడు ఇంకెన్ని కట్టాలు దాసుంచినాడో?! అయన్నీ ఈ ముసిలి ముండ కూతురు సూడొద్దా ? !" అని పడవ ముసలాడితో చెప్తూనే జగన్నాథం అజాగ్రత్త కాలు కనిపెట్టి, "బాబ్బాబు ! తట్టమీద కాలెట్టకు బాబు! నా అయ్యకి కూడుండదల!" అంది ముసలమ్మ.

ఆ బుట్టవంటి చిన్నతట్టవైపు అజాగ్రత్తవల్ల జరిగిన తన పాదాన్ని ఎడంగా తీసుకున్నాడు జగన్నాథం.

"నువ్వు సస్తే ఎలా ముసిలమ్మా ? నీ అయ్యకి కూడెవుడొట్టుకెళ్ళాల?" అన్నాడు పడవ ముసలాడు.

వణుకుతూన్న స్వరంతో ముసలమ్మ ఏదో చెప్పుకుపోతోంది. జగన్నాథం అదేదీ సరిగా వినడంలేదు. అతనా ముసలమ్మ గురించి ఆలోచించడం మొదలెట్టేడు. చావు గురించి ఏవేవో కబుర్లు చెప్తున్నా ఆ ముసలమ్మకి నిజంగా చనిపోవాలని లేదని అతనికి తోచింది. అయితే ఆమె ఇంకా ఎందుకోసం ఈ జీవితంలో ఏం సాధించాలని బతికుందో అతనికి అర్థంకాలేదు. అంత స్పష్టంగా అంతటి దుస్థితిలో ఉండీ కూడా ఆ ముసలమ్మ ఏ మంచికోసం, ఎవరి మంచికోసం, ఏ ఆనందంకోసం ఎవరి ఆనందంకోసం ఎందుకీ విధంగా పరిస్థితుల్ని

ఎదిరించి ముంచుకువచ్చే వయసుని కాదని అవతలకినెట్టి ఈ మండు టెండని, ఈ ఏటివరదని నిగ్రహించు కొస్తోంది ? జగన్నాథానికి లోతు దొరకలేదు. జగన్నాథానికి నిజంగా తన మట్టుకు చస్తే బావుండునని చాలాకాలంనించీ ఉంది. తనెందుకు బతుకుతున్నాడో అతనికి అర్థం కావడంలేదు. అతని కసలు బతకాలని లేనేలేదు. చావు బతుకుల గురించి ఆలోచిస్తూ శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడతను.

పైన సూర్యుడు సురసుర లాడుతున్నాడు. ఏట్లో ఎర్రని కొత్త నీరు అడ్డదిడ్డంగా అతి తొందరగా గట్లని రాపాడుకొంటూ దొర్లుకు పోతోంది. ఆకాశం నీలంగా నిర్మలంగా మడికట్టుకున్నట్టు దూరంగా నిల్చొంది. అవతలివడ్డున పెద్ద కొబ్బరితోట మధ్యలోంచి లేచిన గుడిగోపురం నల్లసేనపురాయిలా నిశ్చలంగా నిల్చునుంది. గుడికి ఓ పక్క నున్న కొబ్బరిచెట్లు ఈదురుగాలికి వంగి వంగి దేవుడికి దండాలు పెడుతున్నట్టున్నాయి. గుడికి రెండోవైపున్న కొబ్బరిచెట్లు, దేవుడికి మామీద దయలేదు దయ లేదనినెత్తులు మొత్తుకు నేడుస్తున్నట్టున్నాయి. ఈదురుగాలికి ఏట్లోని కొత్త నీటివాసన ముక్కుల్లోకి తడిగా కొడు తోంది.

జగన్నాథానికి పరిస్థితులేం బాగులేవు. జీవితం అతనికి దినదిన గండంగా వెళ్తోంది. తలిదండ్రులు అతనికి బతుకుతప్ప ఇంకేమీ ఇవ్వ లేక పోయేరు. అతణ్ణి భూమ్మీద పడేసి తల్లి వెళ్ళిపోయింది. ఆ వెంటనే అతని తండ్రిని డబుల్ న్యుమోనియా తీసుకు పోయింది. ఆ తరువాత అతని మేనమామ ఏలాగోఓలాగ అతణ్ణి పెంచుకొంటూ వచ్చి 'ఎస్సెల్సీ' పాస్ చేయించి, టీచర్‌గిరీకి ట్రెయినింగ్ ఇప్పించి, ఆఖరికి తన ఆఖరి కూతుర్నిచ్చి పెళ్ళిచేసేసి ఆ తరవాత అతను వెళ్ళి పోయేడు.

అటుతరవాత జీవితం ?

కాబూలీవాళ్ళ సంఘమంతా జగన్నాథాన్ని వెలివేసింది. సహకార బాంకువాళ్ళు అమలు కాయితాలు పట్టుకొని అతణ్ణి వెంట తరుముతున్నారు. తోటి టీచర్లు అతణ్ణి పలకరించడానికి భయపడతారు, అతను తమని పలకరిస్తే భయపడతారు. అతనికి ఆ విధంగా అప్పెక్కడా పుట్టడంలేదు. రెండు నెలలకోసారి అతను ఇల్లుమార్చ వలసి వస్తోంది, నెలకోసారి అరువుకోసం కిరాణాకొట్టు ఛేంజి చెయ్యవలసొస్తోంది. అతనికి ఏనాడో ముసిలిరూపొచ్చేసింది. పదేళ్ళక్రితంనించీ కూడా అతను యాభయ్యేళ్ళ వాళ్ళాగేఉంటున్నాడు. అతనికి నిజానికి ముప్ఫయ్యారేళ్ళు. ఎండిపోయిన చిన్నసైజు ఆనపకాయకో, ఎండిపోయి వాడి పోయిన పెద్దసైజు వంకాయకో ముక్కూ నోరూ కళ్ళూ చెవులూ తగిలించినట్టుంటుంది అతనిముఖం. అతని వొళ్ళంతా నిన్న వొలిచిన అరటి తొక్కలా మెత్తగా వాడిపోయుంటుంది. అతనికి మొన్నటిదాకా తొమ్మండుగురు పిల్లలు. స్కూల్లో పిల్లలు తొల్త అతనికి "పిల్లల కోడి" అని పేరు పెట్టేరె కాని ఇప్పుడంతా అతణ్ణి టూకీగా "కోడి మేష్టు"రనే రిఫర్ చేస్తారు. అతనికి నచ్చే జీతం చాలా తక్కువ. ట్యూషన్లుచెప్పి డబ్బు సంపాదించడానికి అతని ఓపిక కూడా చాలా తక్కువ. తిండీ దమ్మూ అతనికి లేవు. కాని ఏ నలుగు రైదుగురు కుర్రాళ్ళో అతనింటికి పాఠానికి వస్తూంటారు. అతని భార్య చుట్టుకు పోయి చుట్టుకుపోయి నరంలా ఉంటుంది. చావెప్పటికీ రాకపోవడంతో విసుగెత్తి పోయున్న మనిషిలా కనిపిస్తుందావిడ.

జగన్నాథం దగ్గరకి ట్యూషన్ కి వచ్చే నలుగురైదుగురు కుర్రాళ్ళూ సాయంకాలం చీకట్లో జగన్నాథం ఇంటిముందు కొట్లో కూర్చున్నప్పుడు చాలా భయపడుతూ కూర్చుంటారు. వాళ్ళకి వెనగ్గ

దిలో గుభీ గుభీ మని వీపులమీద గుద్దుల చప్పుడు వినిపిస్తుంది. ఆ తరువాత రపి రపీ మని చప్పుడవుతుంది. అంతలో నయాపైసల్లాటి ముగ్గురాడపిల్లలు తల్లిచేత దెబ్బలు తిని, నరకంలో పాపులు కేకలు వేసి నట్టు కేకలేసి ఏడుస్తూ బైటకొస్తారు. ట్యూషన్లోంచి జగన్నాథం నెమ్మదిగా లేచి వెనకగదిలోనికి వెళ్తాడు, "నాకు చావురాదు మహా ప్రభూ, నాకు చావురాదు," అని అతని భార్య మళ్ళీ రపీ రపీ మని గోడకి తలవేసి కొట్టుకొంటుంది. ఆ చప్పుడు విని ట్యూషన్ కుర్రాళ్ళు ఇంకా భయపడతారు. అప్పుడు చేతులు నులుపుకొంటూ బైట కొట్లోకి వస్తాడు జగన్నాథం. ప్రాణం నిలబట్టుకొందికి చావుతో పోరాడే పేషెంటుకి ఏ మందివ్వాలో తెలియని కొత్త డాక్టర్ ముఖంలా చాలా గాభరాగా ఉంటుందతని ముఖం. భయంగానూ బాధగానూ సిగ్గుగానూకూడా ఉంటుం దతనికి. ట్యూషన్ కుర్రాళ్ళు బితుకూబితుకూ కూర్చొని పాఠం ఎప్పుడయిపోతుందా అని చూస్తారు. వాళ్ళతో "ఈ రోజుకి పాఠం లేదు. వెళ్ళిపోండోయ్ !" అంటాడు జగన్నాథం. అతనలా అనీ అనగానే వాళ్ళు వెళ్ళిపోతారు. మళ్ళీ వాళ్ళకి అక్కడకి రావాలనుండదు. ట్యూషన్ చెప్పించుకోగల తాహతున్న కుర్రవాళ్ళకి పేదరికం అంటే అసహ్యం ఉన్నా లేకపోయినా భయం మాత్రం తప్పక ఉంటుంది. అందుచేత నాలుగు రోజులు వచ్చి ఇంట్లో వరస కనిపెట్టిన ఏ కుర్రవాడూ కూడా అయిదో రోజున ట్యూషన్‌కి మరి రాడు. జగన్నాథం ఎన్ని ఇళ్ళు మార్చినా అన్ని ఇళ్ళూకూడా గుహల్లాగే ఉంటున్నాయి. ప్రతి ఇల్లుకూడా, రోజూ చన్నీళ్ళతో తడిపి రోజూ నీడనే ఆరవేసే కట్టుబట్టలా, మెతక వాసన వేస్తుంది. ఇంటి నిండా ఆర్నెల్లు ఈగలు ముసురుకొనుంటాయి. మరో ఆర్నెల్లు దోమలు విజృంభించి ఇంటిని పాలన చేస్తాయి. గోడల్ని చీమల్లా నల్లులు పాకు

రుతాయి. ఇంటినిండా చలిచీమలు ఆకలి గొన్న పులుల్లా ఆముదం కని పించినా విడిచి పెట్టకుండా నాకేస్తాయి. ఇంట్లో ఎల్లప్పుడూ పక్కిళ్ళ వాళ్ళ పిల్లలు వచ్చి వీరవిహారంచేస్తూ జగన్నాథం పిల్లల్ని కొట్టి ఏడి పిస్తూంటారు.

జగన్నాథంగారికి జీవితంమీద చాలా కాలం విసిగి విరక్తి కలిగి పోయింది.

అతని పెద్దకూతురికి చిన్నప్పణ్ణించీ, అందరు పిల్లలకిలాగే, ఆటలూ పాటలూ, వీధుల్లో సంబరాలూ అంటే ఎంతో ఇష్టం. ఆ పిల్లకి తెలివితేటలూ చురుకుతనం కూడా ఉండేవి. రేపు మార్చికి సెవెన్త్ స్టాండర్డు పాసవుతే ఆ పిల్లకి ఎక్కడైనా ఏ ఉద్యోగమైనా దొరక వచ్చునని ఆశించేడు జగన్నాథం. కాని, ఆ పిల్లకి ఇంటిమీద మమత కలగడానికి ఏ అవకాశమూ లేకపోయింది. పెద్ద దవుతోన్నకొద్దీ, ఆమెకి తన ఇంటికీ నరకానికీ పోలికలు కనిపించినకొద్దీ, వీధే ఆమెకి స్వర్గంలా కనిపించసాగింది. వయసొచ్చిన కొద్దీ, షోకులు చేసుకోవా లనీ షిఫాన్ చీరలు కట్టుకోవాలనీ, ఏ ఉంగరాల జుట్టు కుర్రాణ్ణో కావి లించుకొని స్కూటర్‌మీద తిరగాలనీ ఆమెలో రకరకాల కోరికలు చెల రేగ సాగేయి. దాన్తో ఆమెకి సినీమా లంటే మోజుకూడా పెరిగింది. డబ్బు లేకపోతే ఒంట్లో ఏ భాగమైనా కోసేసుకొని అమ్మకునైనా సరే సినీమాకి వెళ్ళాలనేటంత తీవ్రమైన వాంఛ ఆమె కుండేది. చాలా కాలం ఆమెకి రామారావూ, నాగేశ్వరరావులే కలలో కనపిస్తూండేవారు. ఓ నాడు ఓ వెచ్చని స్నేహితురాలితో అమె ఒక హాలీవుడ్ చిత్రం చూడ్డం తటస్థించింది. ఆ చిత్రనిండా ఆమెకి చిక్కచిక్కని ముద్దులే కనిపించేయి. ఆ రోజుల్లోనే అమె కొన్ని బూతు కథలు చదవడం కూడా జరిగింది. దాన్తో అందం, ఆనందం, స్వేచ్ఛా, స్వర్గం గురించి

ఆమెకుండే భావాలన్నీ సెక్సుతో ముడిపడి పోయేయి. పట్టపగ్గా ల్లేకుండా విచ్చలవిడిగా తిరగాలనే తీవ్రమైన వాంఛతో ఆమె గిలగిల కొట్టుకు పోయింది. అందుకు తగ్గట్టుగా ఆమెకో స్నేహితురాలు కూడా దొరి కింది. ఆ స్నేహితురాలు దొరికిన నెల్లరోజులు తిరక్కుండానే కోడి మేష్టరి కూతురు లాడ్జింగు హవుసులు తొక్కుతోందన్న వార్త కొన్ని సర్కిల్సులో పాకింది. ముక్కూ మొహం తెలియని వాళ్ళతో క్రీడించ డంలో ఆ పిల్లకి కలిగిన ఉద్రేకం ట్రిప్పుట్రిప్పుకీ ఎక్కువవడం మొదలయింది. అందులో డబ్బుకూడా ఉందనేసరికి ఆమె చాలా ఆశ్చర్యపోయి, డబ్బులు ఎదురు తీసుకొని సినీమా చూసినంతగా, ఎంతో సంతోషించింది.

ఓ మందులకంపెనీ ఏజెంటు టూరుచేసుకొంటూ ఆ వూరు కాంపు వచ్చినప్పుడల్లా 'కోడిమేష్టరి కూతుర్ని' రప్పించుకోడం అత నికి అలవాటయింది. ఆ అలవాటే అతని కొంప ముంచింది. అతనికి భార్యయందు చాలా అనుమానం ఉంది. టూరులో ఉన్నప్పుడతను తన భార్య ఇంటివద్ద ఏంచేస్తూందోనని ఊహించుకొని తహతహలాడి పోయి, కోపంతో కుతకుతలాడిపోయి పక్కలో ఉన్న 'కోడిమేష్టరి కూతుర్ని' కరిచి చంపినంత చేసేవాడు. అతను చాలా దుర్మార్గుడు. ఆ రోజున అతను మామూలు కంటే ఎక్కువగా విస్కీపుచ్చుకున్నాడు. "నేను ఇంగ్లీషు డాన్సు చెయ్యగలనుచూడు !" అంటూ కోడిమేష్టరి కూతురు అతి వికృతంగా చేతులుతిప్పుతూ గెంతులు వెయ్యడం మొదలెట్టింది. మామూలుకంటే ఆ పిల్ల చాలా హుషారుగా ఉన్నట్టని పించిందతనికి. తాగేసిన దుమ్మలగొండి చెట్టునీడని నాలికవెళ్ళబెట్టుకు పడుక్కొని కొమ్మని డాన్సుచేసే గువ్వపిట్టని నిద్రకళ్ళతో చూసినట్టు అతను మంచంమీద పడుక్కొని ఆ పిల్లడాన్సు చూస్తూ అలా కళ్ళు

మూసేడు. అతనా రాత్రి వెర్రిగా నిద్రపోయాడు. ప్రొద్దున్న లేచే సరికి అతని పక్కలో ఎవరో పడుక్కునున్నారు. ఎవరని చూస్తే ఆ పిల్ల! అతను చాలా గాభరాపడ్డాడు. రాత్రి ఏం జరిగిందో అతనికి సరిగ్గా గుర్తురాలేదు. పగటివేళ ఆ పిల్లని చూస్తే అతనికి చాలా అసహ్యంవేసింది. "ఛః రాస్కెల్!" అని మనసులో ఆమెని తిట్టుకున్నాడు. "లే! లే! లే!" అని ఆమెని కసిరేడు. ఆ పిల్లలేచింది కాదు. దాన్తో అతనికి కోపం ఇంకా ఎక్కువయింది. తను నిద్రపోయేక తనపక్కనే ఏ వెయిటర్ కుర్రాడితోనో సరసంచేసి సొమ్మసిల్లి పడుక్కునుంటుందని అతనికి అనుమానంకూడా వేసి, దాన్తో అతని కోపం ద్విగుణీ కృతమయింది. లేపడానికి ఆమెనతను గట్టిగా ఛెళ్ళు ఛెళ్ళున కొట్టేడు. కొట్టి ఆమెని ఒక్కసారిగా కిందకిలాగి పారేసేటంత ఫోర్సుతో వత్తిగిలించేడు. వత్తి గిలించేక అతను కొయ్యబారి పోయేడు. అ పిల్ల వికృతంగా చచ్చిపడుంది.

బల్లమీద విస్కీసీసాకింద ఓ కాయితం ఉంది. ఆ రాత్రి ఆ పిల్ల మనసులో ఏ మేఘాలు కమ్ముకున్నాయో చెప్పడం కష్టం. ఆకాయితంలో ఆమె తన చావుకితను తప్ప వేరెవరూ కారకులు కారనీ, మందుల ఏజెంటు బ్యాగ్‌లోని నిద్ర మందుబిళ్ళలు తను తీసుకున్నట్టుగా అతనికి తెలియదనీ, తన చావుకి ఎవరూ చింతించరాదని రాసి సంతకం చేసింది. శవపరీక్ష జరిగేక కాని ఆమె గర్భిణీ అని ఎవరికీ తెలియదు.

ఈ లోపున శవం వాసన ఊరంతా సోకింది. ప్రజలు చేరే లోపున పోలీసులువచ్చి వాలి ఆ మందుకంపెనీ ఏ జెంటునీ ఆ లాడ్జింగ్ హవుసు ప్రొప్రయిటర్నీ చుట్టు ముట్టి వాళ్ళని నానా అల్లరీ చేసేశారు. ఇది ఆత్మహత్యకాదు ఖూనీ ఖూనీ అని ఓ హెడ్డు నా నా హంగామా

చేసేడు. పోలీసుల్తో తనకున్న పరిచయంకొద్ది ఆ ప్రొప్రయిటరు — కొద్దిలో తేలిపోయేడు. ఏజెంటుని మాత్రం వాళ్ళంత సులభంగా విడిచి పెట్టలేదు. కొట్టినంత పనిచేసి ముందు అతణ్ని స్టేషన్కి ఈడ్చుకు పోయేరు. అక్కడ అతను ఇంగ్లీషులో ఆక్స్ఫర్డ్ ఆక్సెంట్‌తో ఏదో చెప్పబోయేడు. "ఈ బొట్లేరింగ్లీషిక్కడ పన్చెయ్యదు. మర్యాదగా కొట్లోకి ముందునడు నడు," అంటూ సబ్ ఇన్స్పెక్టర్ ఎదటనే హెడ్డు గారు అతని మెడమీద అమర్యాదగా చెయ్యివేసి లాకప్‌లోకి నెట్టేడు. ఈ లోపున లాడ్జింగు హవుసు ప్రొప్రయిటరు మందుల ఏజెంటుకీ ఆపదకీ మధ్య అడ్డు పడ్డాడు. ఏజెంటుకీ పోలీసువారికీ తగువు సెటిల్ చెయ్యడంలో అతను తన డబ్బుకూడా రాబట్టేసుకున్నాడు. ఆఖరి కెలాగైతేనేం, శవపంచాయతీలో, పిల్ల ఆత్మహత్య చేసుకున్నట్టుగా కనిపిస్తోందని రాయించడానికి పోలీసువారు వప్పుకున్నారు.

రాత్రల్లా పిల్ల ఇంటికి రాకపోవడంతో గాభరా పడుతూన్న జగన్నాథాన్ని పొద్దున్నే ఇనస్పెక్టరుగారు రమ్మంటున్నారని ఓ జవానొచ్చి పిల్చేడు. దాన్తో జగన్నాథానికి పై ప్రాణాలు పై కెగిరిపోయేయి. లాడ్డింగ్ హవుస్ దగ్గరకతను వెళ్ళేసరికి అక్కడ చాలా మంది జనం గుమిగూడి ఉన్నారు. వాళ్ళ నందర్నీ, తొందరగా ఏదో ట్రెయిన్లో దూరదేశానికి వెళ్తూ చూసినట్టుగా చూసేడు జగన్నాథం. ప్రపంచానికీ తన దౌర్భాగ్యానికీ ఎక్కడా సంబంధం ఉన్నట్టనిపించలే దతనికి. కూతురి చావువార్త విన్నతరువాత అతని మనసంతా కవుకు దెబ్బతిని తిమ్మిరెక్కినట్టయి పోయింది. పోలీసు విచారణలో తన కూతురి గురించి ఎన్నెన్నో ఘోరమైన విషయాలు తెలిసొచ్చేసరికి అతను దిగ్భ్రమ చెంది పోయేడు. బంగారంలాటి పిల్ల వంట్లో కుష్టురోగం ప్రవేశించిందని డాక్టరు చెప్తే తండ్రి మనసంతా వికలమైనట్టు అతని

మనసంతా వికలమై పోయింది. అతణ్నెవరో చెట్టుకి విరచికట్టి ఛాతీ మీద తూటాలవర్షం కురిపించి నట్టయింది.

శవపరీక్ష సాయంకాలం అయిదు గంట లక్కాని పూర్తవలేదు. శవపరీక్ష చేసిన డాక్టరమ్మ ఎలాకోసిన శవాన్ని అలానే విడిచేసి చేతులు కడుక్కు వెళ్ళిపోయింది. మళ్ళా శవాన్ని కుట్టడానికి పని వాళ్ళు "సారా తాగితేనేగాని కుట్టలేం" అని పోలీసులుండగానే స్పష్టంగా చెప్పేరు. దానికోసం డబ్బు కావాలన్నారు. జగన్నాథం దిక్కులు చూస్తూ నిల్చున్నాడు. అతని స్కూల్లోనే పని చేసే కుర్రమేష్టరు ముందుకువచ్చి ఆ ఏర్పాట్లన్నీ తను చూస్తానన్నాడు. కుర్రమేష్టరెవరో కొత్త వ్యక్తిలా అతణ్ని వింతగా చూసేడు జగన్నాథం. చివరకెలాగో శవాన్ని కుట్టడం పూర్తయింది. కాని ఆ పిల్లదాని శవాన్ని జగన్నాథానికి అప్పగించడానికి శవాన్ని కాపలాకాసే జవాను నిరాకరించేడు. శవాన్ని తల్లి కాదు తండ్రికాదు దేవుడి కప్పగించాలన్నా సరే హెడ్డు గారి పర్మిషన్ కావాలన్నాడు. హెడ్డుగారు గైరుహాజరయి పోయేరు. కొత్తనోట్లు కరకర లాడితేగాని అతను కనిపించడని ఎవరో అన్నారు. శవాన్ని మీరేం చేసుకుంటారంటే, మేం తగలెట్టుకుంటాం, పాతి పెట్టుకుంటాం, కుళ్ళ బెట్టుకుంటాం, మా ఇష్టం వచ్చినట్టు చేసుకుంటాం అన్నాడు జవాను. దాన్తో అతనికీ కుర్రమేష్టరికి యుద్ధం అయింది.

ఇదంతా జరుగుతోన్నంత సేపూ పోస్టుమార్టమ్ కొట్టుబైట ఓ పంచని మత్తులో ఉన్నట్టు కూలబడి కూర్చున్నాడు జగన్నాథం. అతనికి ఆకలిగా ఉంది; కళ్ళు మండుతున్నాయి. ఆకాశం అంతా మకిలి మబ్బుల్తో మూసుకు పోయింది. పొద్దున్నించీ చినుకులు పడుతున్నా చినుకు చినుక్కీ కిందనున్న బురద పెరుగుతోందే కాని కాలవల్లోకి కొట్టుకుపోవడంలేదు. గాలి లేకపోవడంతో రాక్షసిబొగ్గుపొగలు కూడా

ఊరంతా కమ్ముకొని చినుకుల్లో చిక్కుకుని చిక్కనవుతున్నాయి. కుట్టిన శవాన్ని బైటకి తీసుకువచ్చి చాపమీదపడేసి కాళ్ళనించి ముఖంమీద్దాకా చీరొకటి కప్పేరు. వానజల్లుకి ఆ చీర నెమ్మదిగా తడిసి శవానికి అత్తు కొంటోంది. దాచినా దాగని పాపంలా ఆ శవం చాలా వికృతంగా ఉంది.

"లెండి జగన్నాథంగారూ లెండి !" అని ఎవరో జగన్నాథాన్ని తట్టి లేపేరు. జగన్నాథం బరువుగా కళ్ళెత్తి చూసేడు. కుర్రటీచరు, "లెండి మేష్టరుగారూ లెండి! మన శవాన్ని మన ప్రభుత్వం వారెలాగైతేనేం ఇచ్చేరు. మరింక లెండి!" అని జగన్నాథాన్ని లేవగొట్టేడు.

శవాన్ని శ్మశానానికి తీసుకువెళ్ళేసరికి బాగా చీకటి పడింది. అక్కడ కొంత తర్జన భర్జనయేక, రెండు హరికేన్ లాంతర్ల వెలుగులో చితికి కర్రలు పేర్చి శవాన్ని చితి మీదకి ఎత్తేరు. ఆ సమయంలో జగన్నాథానికి గతమంతా పొరలు విడి పదహారేళ్ళ వెనక్కి అతణ్ని తీసుకుపోయి ఒకచిన్న కొట్లో నూనెదీపం వెలుగులో ఓ నులకమంచం మీద నిద్రపోతున్న తల్లి పక్క పడుకొని నూనెదీపాన్ని నిబిడాశ్చర్యంతో చూసే తెల్లని పాలపాప పక్క నిలబెట్టింది. చప్పుడు చేస్తే ఆ పాప ఎక్కడ బెదిరిపోతుందోననే బెదురుతో అసక్తితో ఆపేక్షతో ఆశతో ఆ పాపని ఆప్యాయంగా వంగిచూసి ఆనందించి చప్పుడు చెయ్యకుండా అలా చూస్తూనే వెనక్కి నడిచేడారోజున జగన్నాథం. తను సృష్టించిన ప్రాణే ఆ పాప అనే విషయం ఆ రోజున అతణ్ణి ఆనందసాగరంలో ముంచెత్తింది. పుట్టిన మర్నాడు నూనెదీపపు వెలుక్కోసం కళ్ళప్పగించిన ఆ పాలపాప ఆ తరవాత ఏ వెలుగులకోసం ఆశపడింది? ఏ కొరివి దయ్యాల్ని చూసి మోసపోయింది? చివరకి ఏ విధంగాహతాశురాలై ఈ విధంగా ఈ రాత్రి ఈ చితెక్కింది ? అందుకు

కారణాలు ఆ పిల్ల జీవితంలోనే కాక తన జీవితంలోనూ, మొత్తం సంఘం లోనూ కూడా వెతకాలేమోనని జగన్నాథానికి అస్పష్టంగా తోచింది. గత స్మృతులన్నీ ఆ సమయంలో అతణ్ణి కుంగిదీసేయి, ఏడుద్దామంటే అతని కాసమయంలో ఏడుపు రాలేదు. "ఇందుక్కూడా నేను దరిద్రుణ్ణా?" అనుకున్నాడతను.

శ్మశానం నించి తిరిగి వస్తున్నప్పుడు పక్కనున్న కుర్రటీచరు జీవితం, వెలుగు, ధైర్యం, అభ్యుదయం, పోరాటం వగైరా విషయాల గురించి అదేపనిగా ఉపన్యాసం దంచేడు. తనతోడి మిగతా టీచర్లెవరూ శవాన్ని చూద్దామన్న కుతూహలంతోనైనా తనవద్దకి రాకపోవడం గమనించే స్థితిలో లేడు జగన్నాథం. కుర్రటీచరు గురించి మాత్రం "దేవుళ్ళా కాపాడుతున్నాడు!" అనుకున్నాడు.

కుర్రటీచరు స్కూల్లో కొత్తగా చేరేడు. ఎక్కడ తగువులూ అల్లర్లూ జరిగినా అక్కడ అతనుండి తీరుతాడు. అతను పల్చగా పొడుగ్గా ఎప్పుడూ పైజమా జుబ్బా వేసుకుంటూంటాడు. అతని కళ్ళు వెర్రిగా ఎర్రగా ఉంటాయి. అతనికి దుఃఖం వచ్చినప్పుడే కాకుండా అతనికి కోపం వచ్చినా సంతోషం వచ్చినా కూడా ఆ కళ్ళంట కన్నీళ్ళు జలజలా రాల్తాయి. స్కూల్లోనూ స్కూలు బైటా కూడా అతను అతి హడావిడి చేస్తూంటాడు. "ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడి" అనే సామెత నాధారంగా చేసుకొని అతనంటే సరిపడని తోడిమేష్టర్లు అతనికి కుక్కల మేష్టరని పేరుపెట్టారు. కాని అతను ఏదైనా పట్టుకున్నాడంటే రేచుకుక్కలా పట్టుకుంటాడని వాళ్ళకి తెలుసు. జగన్నాథానికి ఆపదొచ్చిందని తెలిసిన వెంటనే కుర్రమేష్టరు రంగంలోకి దిగిపోయి అదేదో తన స్వంత ఆపదలాగ తీసుకొని, ఆ ఆపదేదో దుర్మార్గుడయిన మనిషయినట్టు దాన్తో పోరాటంలోకి దిగిపోయేడు. అతనికి టాక్టు లేక

గడుస్తనం తక్కువ. ఎవరితోనైనా బండగా మొండిగా దెబ్బలాడ తాడు. అతనికి నాజూకు కలహాలగురించి సరైన వివరాలు తెలీవు. కాని, అతనే లేకపోతే "ఈ రోజున ఏమయేదో?" అనుకున్నాడు జగన్నాథం.

ఇంటివైపు నడుస్తూ ఆ క్రుటీచరు వసపిట్టలా ఏదో చెప్పుకు పోతున్నాడు. అంతలో ఇద్దరూ జగన్నాథం ఇంటిదగ్గిర ఆగేరు.

"అబ్బాయీ! నువ్వుండు మరి!" అన్నాడు జగన్నాథం.

"ఉంటాను. కాని. మరి, మీరు...." అని క్రుటీచరేదో చెప్ప బోయేడు.

"నువ్వే లేకపోతే ఈ దినం నా కెలా జరిగేదో ఆ భగవంతు డికే ఎరుక! నువ్వీరోజున చేసిన సాయానికి నేన్నీకు ఎంత రుణపడి ఉన్నానో...." అని జగన్నాథం మరింక మాటాళ్ళక అతని చేతులు పట్టుకున్నాడు.

క్రుటీచరు ఆ సందులో, ముసురులో, మ్యునిస్పల్ దీపపు మకిలవెలుగులో, బురదలో. కుళ్ళులో, కంపులో నిలబడి ఉద్రిక్తుడయి ఏదో ఎవరో ఆవేశించిన వాళ్ళా చెప్పుకుపోయేడు. చెప్తూంటే అతని కళ్ళంట నీళ్ళు జొట జూట జారేయి.

"గురువుగారూ! ధైర్యంగా ఉండండి! ధైర్యమే మనకి కావల సింది. ఈ జీవితం మనలాటివాళ్ళకి కత్తులబాటని నాకు తెలుసు. మనకి కళ్ళుకప్పి నోరుమూసి చావజంపి వాళ్ళ బండగానుగులన్నీ మనచేత బలవంతంగా తిప్పిస్తున్నారు. ఎవరు తిప్పిస్తున్నారు? ఎవరో మీకూ తెలుసు! కాని ఇందులోంచి మనం బైటపడాలి! బైటపడతాం! కాని బైటపడాలంటే మనకి—పట్టుదలా ధైర్యం— రెండూ ఉండాలి. మీ

అమ్మాయి ఎందుకు మోసపోయిందో, చివరకి ఏ విధంగా శక్తిలేక ఎందుకు ఓడిపోయిందో నాకు తెలుసు. కాని ఆ విధంగా చావు కాదు మనకి కావలసింది. మనల్ని ఆ మాదిరిగా అవకతవక రోడ్డు పట్టించి అసహాయుల్ని చేసి చంపడానికే సంఘాన్ని ఈ మాదిరిగా నడిపించడం జరుగుతోంది. కాని మనం మరింక ఆ విధంగా జరగనివ్వం! మనక్కావలసింది బతుకు. బతుకు. బతుకు! మంచి బతుకు మనకి కావాలి! ఈ చీకట్లోంచ ఈ ముసురులోంచి ఈ దుర్గంధంలోంచి మనం బైట పడతాం!! మనకి లేదు లేదు చావు. లేదంటే లేదు!!!" అంటూ పదిలేల మంది సభలో ఉపన్యసించినట్టు కేకలువేసి చెప్పేడు కుర్రటీచరు.

అతను చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడే కాని జగన్నాథానికదేం అర్థంకాలేదు. ఆ కుర్రాడెప్పుడూ అదే విధంగా ప్రతి టీచర్ సంఘం మీటింగుల్లోనూ చెప్తూంటాడు. సాదా మనుషులందరికీ మంచి జీవితం ముందుకి తప్పక ఉందనీ. దానికొాసం అంతా కలిసి పోరాడాలనీ అతను రోజూ వేసే కేకల సారాంశం? జగన్నాథం అతని మాటలెప్పుడూ సరిగా బోధపర్చుకోలేదు. కుర్రవాడు మంచివాడు! ఏదో చెప్తున్నాడు; కాబట్టి మనం మర్యాదగా వినాలి. అంతే అతని ఉద్దేశం. ఆ విధంగా వినేసి ఆ రాత్రి కూడా మర్యాదకి మామూలుగా ఊఁ కొట్టేసేడతను. జగన్నాథం ఆ సమయంలో యింటికి ఎలా వెళ్ళడంరా భగవంతుడా అనే దిగుల్లో ఉన్నాడు.

భయపడుతూ నడవలో జగన్నాథం అడుగుపెట్టేసరికి పది దాటింది. అతని కెదురుగా గది తలుపు బార్లా తెరిచుంది. గదిలో బుడ్డి దీపం ఒకటి బాగా పొగచూరి గుడ్డిగా వెలుగుతోంది. రోజల్లా ఏ డ్చి శక్తిలేక సొమ్మసిల్లి పడిపోయినట్టు అతని భార్య వట్టి నేలమీద ఓ వార పడుకుంది. ఆమె మీద, అటుంచీ ఇటుంచీ కూడా తలలు పెట్టు

కొని, చచ్చిన బలుల్లా నలుగురు ఆడ పిల్లలు పడుకున్నారు. ముగ్గురు మగపిల్లలు చొక్కాల్లేకుండా గదినిండా అడ్డదిడ్డంగా ఎవరో కూల దోసేస్తే కూలిపోయినట్టు పడిపోయున్నారు. ఓ పిల్లడు తల్లి తల పక్కనే కూర్చొని నోట్లోవేలు పెట్టుకొని గోడకి చేర్లబడి కూర్చొనే నిద్రపోతున్నాడు. వాళ్ళంతా శవాలకొట్లో శవాలగుట్టలా ఉన్నారు, ఆ సమయంలో జగన్నాథానికి జీవితంలోని తన అసహాయత, తన దైన్యం, తన దుస్థితీ అంతా కళ్ళకి కట్టినట్టయి అతనికి వెక్కివెక్కి ఏడుపొచ్చింది. "మా కెందుకీ బతుకు! చావురాకూడదా తండ్రీ, మూకుమ్మడిగా అందరికీ ఒకేసారి చావు రాకూడదా?!" అని అతను గోలపెట్టేడు.

సందులో మున్సిపల్ దీపాలు ముష్టి వాళ్ళ కళ్ళల్లా ఉన్నాయి. సందులో చినుకులు ముసలివాళ్ళ ఏడుపుల్లా చూర్లనుంచి బొట్లు బొట్లుగా రాల్తున్నాయి. సందులో కాళ్ళీడ్చుకొంటూ వంటరిగా నెమ్మదిగా వెళ్ళే ముసలతనొకడు వెళ్తూ వెళ్తూ భయంవల్ల ఆగిపోయేడు. జగన్నాథం ఏడుపతనికి ఎక్కడో భూస్థాపితమైపోయిన మనిషెవరో బాధతో బలంగా వేసిన కేకలు కష్టంమీద భూమిని పెళ్ళగించుకొని హీనంగా వినవస్తున్నట్టని పించింది. నేలవంక ఓ సారి చూసి తరవాత "తండ్రీ! వింటున్నావా కేకలు?" అని ప్రశ్నించినట్టు ఆకాశం కేసి ఓ సారి చూచి, తరవాత తలాడించుకొంటూ ఏదోగొణుక్కుంటూ ముందుకి నడుచుకు పోయేడు ముసలాయన.

ఆ ఘోరం అదంతా నిన్న జరిగింది.

ఈ రోజున పొద్దున్నే మళ్ళీ అప్పుకి బయల్దేరేడు జగన్నాథం. అతనికి నిన్నటి రాత్రి చచ్చి పోవాలని నిజంగానే అనిపించింది. కాని, పొద్దున్నేలేచి ఏటవతల పల్లెటూళ్ళో వున్న తన తోడల్లుడి దగ్గరికి

అప్పుకి బయల్దేరేడు. వాళ్ళతణ్ని రమ్మన్లేదు. తన కూతురి చావు వాళ్ళకతను తెలియజేశాడు. పిల్ల ఆవిధంగా అప్రతిష్ఠ పాలయినందుకు నోళ్ళునొక్కేసుకోవాలో, లేక పిల్ల ఆవిధంగా ఆపదపాలయి అసువులు తీసుకున్నందుకు విచారించాలో తెలియక వాళ్ళు తికమక పడ్డారు. డబ్బు కోసం, ముష్టివాళ్ళు గుడ్డికళ్ళనీ సొట్టకాళ్ళనీ చూపించినట్టు, జగన్నాధం తన కూతురి చావునిసాకుగా ఉపయోగించు కొంటున్నాడేమోనని అనుమానంతో వాళ్ళు అతనిమీద లోలోపల చాలా మండిపడ్డారు. చివరికి నోటితో లేదనకుండా, ఓ పదిహేను రూపాయిలు మాత్రం ఇచ్చి చేత్తో లేదనిపించేరు. ఆ పదిహేను పట్టుకొని నెమ్మదిగా తిరుగుముఖం పట్టేడు జగన్నాథం.

పడవ్వాడు బేరాలొస్తాయేమోనని ఇంకా ఆశపడ్డాడు. పదినిమిషాలయింది కాని ఎవరూ రాలేదు. అతను చాలా విసుక్కున్నాడు. కాని అవతల వడ్డున నలుగురు స్టూడెంట్లుచేరి పడవ్వాడికోసం కేకలు వేసి చప్పట్లుకొట్టి ఈలలు వేసేరు. దాన్తో ముసలాడు పడవబయల్దేరదీసేడు. అతని మాటలో చురుకుతనంకూడా వచ్చింది.

"అన్నట్టు, ముసిలమ్మా ! ఇయాళ సమ్మె గావాల ?" అన్నాడు పడవముసలాడు.

"అవును ! మర్లో మా వోళ్ళంతా ట్రయికే !" అంది ములసమ్మ.

"మరైతే కూడెవరికి ఒట్టుకెళ్తన్నావ్ ?"

"మా అయ్యకే !"

"అందరూ ట్రయికు జేత్తె మీ వోడు పన్లో కెల్తన్నాడేటి ?" అన్నాడు పడవ ముసలాడు.

"శ ! అదేట్రా?! తప్పుమాట ! మావోడు గేటుకాడ కాపలా!" అంది ముసలమ్మ.

"దేనికి ?"

"దొంగపనోళ్ళు ఎల్లకుండాను !"

"అదా ?"

"హది గది !"

వాళ్ళ మాటలు వింటూనే తన బతుకు గురించి ఆలోచిస్తున్నాడు జగన్నాధం. అతనికి, నిజంగా, తనెందుకు జీవించి ఉన్నాడో అర్థం కావడంలేదు. ఈ క్షణాన్న ఈ యేట్లోపడి చస్తే ? ఎందుకు చావ రాదో అందుకతనికి కారణాలు కనిపించలేదు.

ఆకాశం నీలంరాయిలా ఉంది. సూర్యుడు నిప్పులు కరిగించి నిండా పోసిన పళ్ళెంలా ఉన్నాడు. మెత్తగా మరాడించిన వెండి పొట్టులా ఎండ మెరుస్తోంది.

జగన్నాథానికి తళ తళ్ళాడే ఏటినీటిని చూస్తోంటే, ఎందుకో గాని, తన చిన్ననాటి జీవితం గుర్తుకువచ్చింది. ఏ రింతకంటెపోటుగా వున్నప్పుడు అతి సునాయాసంగా తను అటుంచి ఇటూ ఇట్నుంచి అటూ ఈదగలగడం జ్ఞప్తికివచ్చి అతను ఆశ్చర్య పోయేడు. ఎందుకు అప్పుడు తనకా ఉత్సాహం ? ఎందుకిప్పుడు తనకీ నైరాశ్యం ? తనకీ నడికాలంలోనే ఈ ముసలితనం ఎందుకు ? ఆ ముసలమ్మకి ఆ ఉడుకు రక్తం ఇంకా ఎందుకు ? ఇప్పుడు తనకి చావుమీద ఈ ఉలుకెందుకు? ఆ ముసలమ్మకి దేనికోసమోకాని అంత గట్టి పట్టుదలెందుకు ?

"ముసలమ్మా ! కుసింత మద్దెని కూకో తల్లీ ! పడవ విసురు తోంది !" అన్నారు పడవ్వాళ్ళు.

"బద్రంగా ఎళ్నియ్ నాయిన్నాయన ! ఒచ్చే జల్మల నీ కడు

పున బడతాను !" అంది ముసలమ్మ, అంచుదిగి పడవమధ్య బుట్ట పట్టుకూర్చొని.

"నువ్వుకూడా మయంబద్దమీద కొచ్చీ బాబూ !" అన్నారు పడ వాళ్ళిద్దరూ జగన్నాథంతో. వాళ్ళు చెప్పినట్టే కూర్చున్నాడతను !

ఏటిమధ్యకి వచ్చింది పడవ.

అకస్మాత్తుగా "కొంపతీసి పడవ మునిగి పోదు కద ?!" అని పించింది జగన్నాథానికి. అతనికి చప్పున భయంకూడా వేసింది. కాని అంతలోనే నవ్వుకున్నాడు. "ఎలాగో వో లా గ వేగిరం ఇంటికి మాత్రం చేరాలి" అనుకున్నా డతను.

"ముసిలిముండని సంపీకువాబూ !" అంటోంది ముసలమ్మ.

"ముసిలోళ్ళం జస్తే ఎవు రేడాల ముసిలమ్మా ?" అన్నాడు పడవ ముసలాడు ప్లేటు మార్చి,

"అలా అనకరా బాబూ! మనవల దినం మనం దీర్చాల. మన దినాలు మనవలు దీర్చాల. ఉట్టి ముసలిముండనో గట్టి ముసలిముండనో ఓ ముండనంటూ నానున్నాను గాబట్టి మా అయ్యకిప్పుడు కూడొట్టుకు పోతన్నాను. నువ్వున్నావు గాబట్టి కొడుక్కు సెయ్య సాయం జేత్త న్నావు. ఆళ్ళా ఉండాల మనవూ ఉండాల ఒకురుకొకురు సా య ం జేసుకుంటాను! ఎవురూ ఏడ్డుకదా అన్జెప్పి సావాలంటే ఉన్నోళ్ళం దరూ జావాల: దానికేటి? ఆ మాటకి నేనొప్పుకోను."

అలా సంభాషణ సాగుతోండగా పడవ కూడా ముందుకి సాగు తోంది, ఏటిమధ్యనే ఎక్కువ పోటుగా ఉంది. "ఒడ్డు సమీపించేం, మరి ఫరవాలేదు" అనుకున్నాడు జగన్నాథం.

కాని,

అంతలో,

అవతలి గట్టున కూర్చున్న స్టూడెంటు కుర్రవాళ్ళు ఒక్కసారిగా కేకలువేసి నిలబడిపోయేరు. అందులో ఓ కుర్రవాడికి జగన్నాథం భయంముఖం అరక్షణంలో సగంసేపు కనిపించడంతో ఆ కుర్ర వాడికి కిసుక్కున నవ్వొచ్చింది; కాని, అంతలోనే, ఇది ప్రమాదకర మైన విషయం, ఘోరవిపత్తు. అని గుర్తు చేసుకుని ముఖాన్ని సీరి యస్‌గా మార్చుకున్నాడు. మిగతా ముగ్గురు కుర్రవాళ్ళూ తమకు ఈత బాగావచ్చుననే సంగతి మర్చిపోయేరు. ఆ ముగ్గుర్లో ఒకతను చేతిలో ఉన్న ధర్మాస్ఫ్లాస్క్ ఎత్తేసి, "పడవ! పడవ! హెల్ప్! హెల్ప్!" అని చేతులెత్తి కేకలు వెయ్యడం ప్రారంభించేడు.

పడవాళ్ళిద్దరూ తల్లకిందులై పోయిన పడవని వదలకుండా పట్టు కున్నారు. ముసలమ్మ మాత్రం కొట్టుకుపోయి చేతులెత్తి కేక వెయ్య బోయి మునిగి తేలి మళ్ళీ కొట్టుకుపోతోంది ముందుకి, జగన్నాథం ఆమెకోసం బారలువేస్తూ బాణంలా ముందుకు సాగేడు.

స్టూడెంట్సు వద్దునుండి "బ్రేవో! కమాన్! బ్యూటిఫుల్! లవ్లీ!" అంటూ కేకలు వేసేరు.

ముసలమ్మని ఎలా పట్టుకోగలిగేడో జగన్నాథానికి సరిగా తెలి యనేలేదు. అంతలో అతని సాయానికి పడవ ముసలాడి కొడుకూడా వచ్చేడు. మరి కాస్సేపటికి పడవ వొకచోట ముసలాడితోపాటు వడ్డుకు చేరింది. ముసలమ్మని ఓ చోట ఒడ్డుని పడేసేరు.

అంతలో పక్క కొబ్బరి తోటలోంచి పాటకపుజనం పరిగెట్టు కొచ్చేరు. పడవ ముసలాడు వగర్చుకొంటూ కూర్చున్నాడు. అతని కొడుకు, వచ్చిన జనంతో, ప్రమాదం ఎలా జరిగిందో వివరిస్తున్నాడు. "ముసిలమ్మా! బతికే ఉన్నావు! మరేటి బయంనేదు!" అని ముసలమ్మ

కెవరో ప్రథమ చికిత్సచేసి ధైర్యం చెప్తున్నారు. కాలేజీ నాటకంలో అనుకోకుండా బాగా నటించిన బంట్రోతు పాత్రధారిని అధ్యాపకులంతా అభినందించినట్టు స్టూడెంటు కుర్రవాళ్ళు జగన్నాథాన్ని అభినందిస్తు న్నారు.

బట్టలు పిండుకొని ఓ రాయిమీద కూర్చున్నాడు జగన్నాథం.

ఆ వెచ్చని ఎండలో ఆ చల్లగాలిలో ఆ ఆయాసంలో అప్పుడత నికి కుర్రమేష్టరి ఉపన్యాసాలు గుర్తుకి వచ్చేయి. పక్కనే లేచి కూర్చున్న ముసలమ్మ బతుకంతా అప్పుడతనికి అర్థమయింది. ఏది లేకపోడంచేత తన జీవితం అంసపూర్ణంగా ఉండిపోయిందో అప్పుడత నికి సుస్పష్టంగా బోధపడింది.

జగన్నాథం ఒక్కసారి తృప్తిగా నిట్టూర్చి కొత్త కళ్ళతో చుట్టూ చూస్తూ కూర్చున్నాడు.

పైనించి వెర్రిసూర్యుడు కోటానుకోట్ల అజ్ఞాత ప్రాణుల వెచ్చ దనం కోసం కోటానుకోట్ల కిరణాల్ని ఏమీ కానట్టు వెచ్చిస్తూ పక్కన నవ్వుతున్నాడు. ఏటినీరు దూర దూరాల్లో ఉన్న ఏ ఎండిన భూముల్ని పండించడానికో, ఏ సాగర తరంగాలతో ఆడుకొందుకో ఎందుకోగాని ఎగిరి గంతులేస్తో ముందుకి పరిగెడుతోంది. తోటల్లోంచి వీచే చల్లగాలి ఏ ఎత్తుకొండలనుంచి దూకడానికో, ఏ తుఫానుల్ని రేపడానికో, ఏ విష మేఘాల్ని ఛిన్నాభిన్నం చేసి చించి చెండాడ్డానికో ఎందుకోగాని విజయ శంఖం పూరించి విశృంఖలంగా ముందుకు సాగుతోంది.

ఒళ్ళు వెచ్చనవగా మెల్లిగా లేచి కూర్చుంది ముసలమ్మ. ఆమె ఎండు జుట్టునిండా నిండిన నీటితుంపర్లు ఎండకి మిలమిల్లాడేయి. ముస లమ్మ ముగ్గుబుట్టలాటి తల ఆ ఎండలో వజ్రాలబుట్టలా మెరిసింది.

●